క్లుప్తంగా

గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష

గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు అధికారి కేవీఎల్ ప్రసాద్



వేమూరు: గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని బాపట్ల జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు అధికారి కేవీఎల్ ప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ సిబ్బందితో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందజేస్తుందన్నారు. సిమెంట్, ఇనుము సైతం ప్రభుత్వమే ఇవ్వడం జరుగుతుందన్నారు. లక్ష్యం మేరకు లబ్ధిదారుల చేత గృహ నిర్మాణాలు పూర్తి చేయించాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరి రావు, డీఈ బి సీతారామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారం హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ నిర్మల



చుండూరు(వేమూరు): సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు సక్రమంగా వినియోగించుకొని ప్రభుత్వ శాఖల ద్వారా కావాల్సిన సమాచారాన్ని పొందవచ్చని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ నిర్మల అన్నారు. చుండూరు మండల కేంద్రంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. సమాచారం హక్కు చట్టం-2005 విధి విధానాలను వివరించారు. డీఏటీటీ బాపట్ల శాస్త్రవేత్త డాక్టర్ జె రాధాకృష్ణ వరిలో యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు. ఏరువాక కేంద్రం బాపట్ల శాస్త్రవేత్త డాక్టర్ ఉష మాట్లాడుతూ వరిలోని కొత్త వంగడాలు, వాటి లక్షణాలు, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ లక్ష్మీ, ఏవో బండ్లమూడి ఆదాంబాబు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై నేడు అవగాహన

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సమాచార హక్కు చట్టం-2005 పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి చిర్రావుల సత్యానంద్ తెలిపారు. సమాచార హక్కు చట్టం కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శుక్రవారం ఈ చట్టంపై మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఆసక్తి కలిగిన పౌరులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

నేడు ఆరుంబాకలో సమాచార హక్కు చట్టంపై అవగాహన

చెరుకుపల్లి: ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిధిలోని ఆరుంబాక రైతు సేవా కేంద్రం నందు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మండలంలోని గ్రామస్థాయి, మండలస్థాయి అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చుండూరు(వేమూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏ ఈ దోనేపూడి అర్జునరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జగడగుంటపాలెం పరిధిలోని 33-11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని చుండూరు మండల గ్రామాలైన చినపరిమి, మండూరు, ఆలపాడు, చినగాదెలవర్రు, అరమండ పేట, కారుమూరివారి పాలెంలో విద్యుత్ లైన్‌లు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

దాతల సహకారం అభినందనీయం

బాపట్లటౌన్: దాతల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి సాధ్యమవుతుందని చెరువు జమ్ములపాలెం హైస్కూల్ హెచ్‌ఎం వి.వి.కృష్ణారావు తెలిపారు. మండలంలోని చెరువు జమ్ములపాలెం గ్రామానికి చెందిన చెన్నుపాటి కిషోర్ రూ.10 వేలు, వంకాయలపాటి హరిబాబు రూ.2వేలు చొప్పున పాఠశాలలో బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ ఆడే విద్యార్థులకు విరాళాలు అందజేశారన్నారు. ఉపాధ్యాయులు దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు బి.వీరచంద్రరావు పాల్గొన్నారు.

తాతావారిపాలెంలో విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

- జ్వర పీడితులకు తక్షణ వైద్యసేవలు
- యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య నిర్వహణ
- నేడు డీఎంహెచ్‌వో విజయమ్మ గ్రామ సందర్శన



పొక్లెయిన్‌తో పూడిక తీయిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి, కార్యదర్శి అనూరాధ



తాతావారిపాలెంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

తాతావారిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని తాతావారిపాలెంలో జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో ఈ నెల 5 నుంచి వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి టి.అనూరాధ తెలిపారు. ఈ నెల మొదటి వారంలో గ్రామానికి చెందిన పలువురు పుట్టపర్తి యాత్రకు వెళ్లి తిరిగి వచ్చిన తరువాత నుంచి జ్వరాల బారిన పడ్డారని ఆమె పేర్కొన్నారు. గత ఐదారు రోజులుగా వర్షాలు కురియడంతో పరిస్థితి తీవ్రతరమై ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు జ్వర పీడితులుగా మారుతున్నారని పేర్కొన్నారు. భట్టిప్రోలు పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది అప్రమత్తమై వైద్య శిబిరాలు నిర్వహించి పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశారు. గ్రామంలో మురుగునీరు పారుదలకై పొక్లెయినర్ ఏర్పాటు చేసి గ్రామ సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి దగ్గరుండి పూడిక తీయించారు. పరిస్థితి అదుపులోకి వచ్చేంత వరకు గ్రామంలో వైద్య శిబిరాలు కొనసాగించనున్నట్లు కార్యదర్శి అనూరాధ తెలిపారు. గురువారం గ్రామంలో 17 మంది జ్వరాల బారిన పడినట్లు గుర్తించి వారికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ఎస్.విజయమ్మ, మలేరియా శాఖాధికారులు గ్రామంలో పర్యటించనున్నట్లు వైద్య ఆరోగ్య సిబ్బంది తెలిపారు.

అసెంబ్లీ చీఫ్ మార్షల్‌కు ప్రముఖుల నివాళులు

- స్వగ్రామం అల్లూరులో ముగిసిన అంత్యక్రియలు
- నివాళులర్పించిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పిట్టలవానిపాలెం: అసెంబ్లీ చీఫ్ మార్షల్ కూచిపూడి లుధియారావు అంత్యక్రియలను పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామంలో పోలీసు లాంఛనాలతో గురువారం నిర్వహించారు. ఈ నెల 17న విధుల్లో ఉండగా గుండెపోటుతో మృతి చెందిన లుధియారావు భౌతిక కాయాన్ని ఆయన స్వ గ్రామం అల్లూరుకు తీసుకువచ్చారు. గురువారం లుధియారావు భౌతికకాయాన్ని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ, అసెంబ్లీ మాజీ చీఫ్ మార్షల్ దుండి ఏడుకొండల రెడ్డి, బాపట్ల డీఎస్పీ మురళీ కృష్ణ, బాపట్ల రూరల్ సీఐ హజరత్‌బాబు, చందోలు ఎస్ఐ అనిల్‌కుమార్లు తదితరులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. అల్లూరు గ్రామ శివారు నత్తలవారిపాలెం నుంచి స్మశాన వాటిక వరకు లుధియారావు భౌతిక కాయాన్ని స్వయంగా తీసుకువెళ్లారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు ఎండీ.అఫ్జల్, టీడీపీ నాయకులు సాంబమూర్తిరాజు, గ్రామ మాజీ సర్పంచ్ బడుగు ప్రకాశరావు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

సోషల్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డి.దేవానంద రెడ్డి, పక్కన రాష్ట్ర అసోసియేట్ నాయకులు

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థుల కోసం రూపొందించిన మెటీరియల్‌ను రాష్ట్ర పరీక్షా విభాగం సంచాలకులు డి.దేవానందరెడ్డి గురువారం ఆవిష్కరించారు. విజయవాడలో ఈ మెటీరియల్‌ను ఆయన చేతుల మీదగా ఆవిష్కరించినట్లు ఫోరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ తెలిపారు. సాంఘిక శాస్త్రంలో 10కి 10 గ్రేడ్ పాయింట్లు సాధించడానికి ఈ మెటీరియల్ ఎంతగానో దోహద పడుతుందని ఆయన పేర్కొన్నారు. నిష్ణాతులైన ఎస్సార్పీ, డీఆర్పీలు, బుక్స్ రైటర్స్‌చే ఈ మెటీరియల్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజేశ్వరరావు, ఎ.జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

పరిపాలన గాలికొదిలేసిన మోదీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పక్కన వనజ, నాగేశ్వరరావు

లక్ష్మీపురం: ప్రస్తుతం దేశం అనేక సమస్యలతో సతమవుతుంటే.. పరిపాలనను గాలికొదిలేసిన ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్ సేవలో నిమగ్నమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో గురువారం జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అంబాని, అదానీల సంతోషమే తన సంతోషంగా మోదీ భావిస్తున్నారని ఆరోపించారు. గ్రామీణ, రైతాంగ సమస్యలు, పేదరికం అలాగే ఉందని.. వీటిపై మోదీ ఒక్కసారి కూడా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. విమానాశ్రయాల్లో లగేజీ మోసే ఉద్యోగానికి ముంబైలో 25 వేల మంది పట్టభద్రులు బారులు తీరడం చూస్తే దేశంలో నిరుద్యోగం ఏ స్థాయిలో విలయతాండవం చేస్తుందో అర్థమవుతోందని రామకృష్ణ పేర్కొన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ప్రభుత్వం ఆ హామీని నిలబెట్టుకోలేక పోవడంతో.. డిగ్రీ, పీజీ విద్యార్థులు కూలీలుగా మారుతున్న దుస్థితి నెలకొందన్నారు. మణిపూర్‌కు వెళ్లేందుకు తీరకలేని మోదీ అంబాని కుటుంబ పెళ్లి వేడుకల్లో పాల్గొనడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రికి సూచించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ సీపీఐ శత వార్షికోత్సవాలను వాడవాడలా ఘనంగా నిర్వహించేందుకు శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, సీపీఐ జిల్లా నాయకులు చిన్ని తిరుపతయ్య, సింగారావు పాల్గొన్నారు.

జీఓ నంబరు 77ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న నాసర్‌జీ

లక్ష్మీపురం: పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకంగా మారిన జీఓ నంబరు 77ను తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్స్ పర్యటన చేసి, ఆగస్టు 6న జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు యశ్వంత్ దుర్గా సాయి, శివ, డేవిడ్, గౌతమ్, కిరణ్, బన్నీ పాల్గొన్నారు.

తెనాలి డిపోకు త్వరలో 10 కొత్త బస్సులు

తెనాలిఅర్బన్: తెనాలి డిపోకు నూతనంగా 10 కొత్త బస్సులు త్వరలో రానున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల తెనాలి నుంచి బెంగళూరుకు ఏర్పాటు చేసిన బస్సుకు మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. అలాగే విజయవాడ బస్సుకు కూడా ఆదరణ ఉందన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారంతో చెరుకుపల్లి, గుంటూరు, ఎర్రగొండపాలెంకు కొత్త బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ప్రయాణికుల కోరిక మేరకు కొన్ని బస్సుల వేళలను కూడా మార్పు చేయడం జరిగిందన్నారు. ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లకు ప్రతిరోజు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. శుభకార్యాలు, దేవాలయాల సందర్శనలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని, కావాల్సిన వారు తమను సంప్రదించాలన్నారు. స్టూడెంట్ బస్సు పాసులు ఉదయం 7గంటల నుంచి కౌంటర్‌లో ఇవ్వడం జరుగుతుందని, ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న కళాశాలలు, పాఠశాలల నిర్వాహకులు తమను సంప్రదిస్తే తమ ఉద్యోగులు అక్కడకు వచ్చి జారీ చేస్తారని, ఈ అవకాశాన్ని యాజమాన్యాలు ఉపయోగించుకోవాలని సూచించారు.

కనుల పండువగా గోపాలకృష్ణుని కల్యాణం



బాపట్లటౌన్: భావపురి పట్టణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో గురువారం రైలుపేటలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ గోపాలకృష్ణ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. పాడి పంటలు వృద్ధి చెంది, సకాలంలో వర్షాలు పడాలని స్వామివారిని భక్తులు కోరుకున్నారు. విశేషంగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భావపురి పట్టణ పురోహిత సంఘం గౌరవాధ్యక్షులు మేడూరి శ్రీరామ్మూర్తి, అధ్యక్షులు భువనగిరి వెంకటశాస్త్రి, కార్యదర్శి ప్రసాదశర్మ, కోశాధికారి భీమ సురేష్, కూచిభట్ల శివ నాగమాణిక్యం, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం



వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలు గురువారంతో ముగిశాయి. ప్రత్యేక ప్రార్థనల మధ్య వేడుకలను ఆస్థాన-ఏ ఖాద్రీయ పీఠాధిపతి కరామత్‌షా హజరత్ మాబూ సుభానీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ బద్ధంగా పీర్ల వద్ద పూజలు నిర్వహించారు. మొహర్రం వేడుకలకు చివరి రోజులు కావడంతో ముస్లిం భక్తు లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.భట్టిప్రోలు ఓబిద్ మహల్లా ఆధ్వర్యంలో తల్లి పీరును శుక్రవారం రాత్రి పురవీధుల్లో ఊరేగించారు.

హాస్టల్స్‌లో సమస్యల పరిష్కారానికి వినతి



లక్ష్మీపురం: గుంటూరు జిల్లాలోని హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదన్‌రావును ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎస్సీ బాలల వసతి గృహానికి ప్రహరీ, బీసీ హాస్టల్‌లో ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని, హాస్టల్ అడ్మిషన్స్‌ను నూరుశాతం ఇవ్వాలని కోరారు. వసతి గృహాల్లో సౌకర్యాల కొరత, మెస్, కాస్మోటిక్ చార్జీల పెండింగ్, భవనాల అద్దె చెల్లింపు తదితర అంశాలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని డీడీ హామీ ఇచ్చారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.సుచరిత, జిల్లా కమిటీ సభ్యులు ఎ.యశ్వంత్ ఆరిఫా ఉన్నారు.

ఇంటిపై విరిగిపడిన తాటిచెట్టు

కొల్లూరు : గాలుల ఉధృతి కారణంగా ఓ గృహంపై తాటిచెట్టు విరిగిపడి ఇల్లు స్వల్పంగా ధ్వంసమైన ఘటన చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. కొల్లూరు గౌడపాలెంలో పరిశ పరమేశ్వరరావు భార్య, ఇరువురు పిల్లలతో చిన్న పాటి రేకుల ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి పెనుగాలులతో కూడిన వర్షం కారణంగా గాలుల ధాటికి వారు నివసిస్తున్న ఇంటి పక్కనున్న తాటిచెట్టు ఉన్నపళంగా విరిగి గాలివాటుకు ఇంటిపైన పడింది. తాటి చెట్టు పడిన ప్రాంతంలోనే ఇంట్లో నిద్రిస్తున్న తన పిల్లలను పరమేశ్వరరావు భార్య పక్కకు లాగడంతో ప్రమాదం బారి నుంచి తప్పించుకోగలిగారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చుండూరు(వేమూరు): మండల సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ఆరుంధతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జాలాది రూబేను అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

హెల్మెట్‌తో ప్రయాణం.. ప్రాణాలు పదిలం

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



హెల్మెట్‌లు చేతబూని ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

రేపల్లె రూరల్: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి మాత్రమే ప్రయాణాలు చేయాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు వారి ఆదేశాలతో హెల్మెట్ సహిత ప్రయాణంపై పట్టణ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు న్యాయవాదులతో కలిసి బుధవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. చట్టరీత్యా శిక్షార్హమని పేర్కొన్నారు. ప్రమాదాలు చెప్పిరావని, ముఖ్యంగా ప్రయాణాలు చేసే సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందన్నారు. హెల్మెట్ ధరించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపేవారు ఎటువంటి ప్రమాదాలకు గురికారన్నారు. ప్రమాదవశాత్తు వాహనంపై నుంచి కింద పడినా తలకు ఎటువంటి గాయం కాదని, ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడవచ్చన్నారు. వాహనాలు నడిపేవారు వెనుక తమ కుటుంబం ఉందని భావిస్తే సురక్షితమైన ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తారన్నారు. అనంతరం పురవీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ,, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బాలికా వికాసంతో సురక్షిత సమాజం



బాలికా రక్షణపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

వేమూరు: బాలికలపై లైంగిక దాడులు, హత్యలు జరుగుతున్నాయని వీటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మహిళా పోలీసులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చదువుకుంటున్న బాలికలకు మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యక్తిగత వికాసంపై విద్యార్థులకు నిపుణుల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో బాలికలను ఎవరైనా లైంగిక వేధింపులకు గురిచేస్తే గ్రామ సచివాలయం మహిళా కానిస్టేబుల్ దృష్టికి తీసుకొని వస్తే వెంటనే సమీప పోలీసు స్టేషనుకు ఫిర్యాదు చేయించాలని సూచించారు. బాలికలకు చదువుతో పాటు ఆత్మ రక్షణ విద్యల్లో ప్రావీణ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసరాల కౌంటర్ ప్రారంభం



పిట్టలవానిపాలెంలో రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న అధికారులు



కొల్లూరులో నిత్యావసర సరకుల దుకాణంలో సరకుల పంపిణీ

భట్టిప్రోలు: ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యావసరాలను వినియోగదారులకు అనువైన ధరలకు అందించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలోని దుకాణాల సముదాయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కౌంటర్‌లో తక్కువ ధరలకు నాణ్యమైన సరుకులను విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రత్యేక కౌంటర్‌లో స్టీమ్ బియ్యం రూ.49, రా బియ్యం రూ.48, కందిపప్పు రూ.160కు విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ డి.రవీంద్ర కుమార్, వీఆర్వోలు శివరామకృష్ణ, ఎ.ప్రసాద్, ఎం జక్రయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను సద్వినియోగించుకోండి

పిట్టలవానిపాలెం: నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు బాపట్ల సీఎస్ డీటీ ఓంకార్ తెలిపారు. పిట్టలవానిపాలెం మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని శ్రీనిలయం వద్ద పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్‌ను స్థానిక తహసీల్దార్ కె.స్ఫూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు అందించేందుకు ఈ రైతు బజార్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్కంరాజు వెంకటపతి రాజు తదితరులు ఉన్నారు.

ధరల నియంత్రణకు ప్రభుత్వం కృషి

కొల్లూరు : నిత్యావసర సరకుల ధరల నియంత్రణకు ప్రభుత్వం కృషి చేస్తుందని కొల్లూరు తహసీల్దార్ పుల్లారావు అన్నారు. గురువారం కొల్లూరు వైష్ణవాలయం సమీపంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు నిత్యావసర వస్తువుల అమ్మకాల దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల ప్రజలు పెరుగుతున్న ధరల కారణంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం ప్రత్యేక దుకాణాలను అందుబాటులోకి తీసుకువచ్చి ధరలను నియంత్రణలో ఉంచేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్, ఆర్ఐ త్రివేణి, వీఆర్ఓ రవి, ఈఓ బి.మల్లికార్జున పాల్గొన్నారు.

భట్టిప్రోలులో కుక్కల బెడద



వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో కుక్కల బెడద ఎక్కువైంది. ఎక్కువగా కుక్కలు సంచరించడం వలన ప్రజలు భయ భ్రాంతులకు గురౌతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా కుక్కలు బాటసారుల వెంట పడుతున్నాయి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరినీ కరుస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

నీట మునిగిన వరి వెదసాగు



పెదపూడిలో ఇంజిన్ ద్వారా నీటిని బయటకు పంపిస్తున్న రైతు

వేమూరు: అల్ప పీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల ధాటికి వరి వెదసాగు నీట మునిగింది. వాటిని కాపాడేందుకు రైతులు ఇక్కట్లు పడుతున్నారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో రైతులు వర్షంపై ఆధారపడి వెద సాగు చేశారు. వరి వెదసాగు పెరుగుతున్న సమయంలో వర్షాల కారణంగా పంటలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో వెద సాగును కాపాడేందుకు రైతులు ఆయిల్ ఇంజన్లు ద్వారా నీటిని బయటకు పంపించేందుకు శ్రమిస్తున్నారు.